
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
సోమవారం। 11। ఆగస్టు। 2025





## 15,916 క్యూసెక్కుల వరద

సోమశిల జలాశయానికి ఆదివారం 15,916 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది. జలాశయంలో 39.353 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. పవర్ టన్నెల్‌కు 1850, ఉత్తరకాలువకు 370, కండలేరుకు 6 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



## బంగారం ధరలు

| | |
|---|---|
| 24 క్యారెట్లు (10 గ్రా) | రూ.1,04,370 |
| 22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా) | రూ.9,445 |
| 3 శాతం జీఎస్టీతో | రూ.9,728 |
| నవర (8 గ్రా) | రూ.77,824 |

## వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.3 /27.4

జిల్లాలో సోమవారం ఉరుములు, మెరుపుల వాతావరణం ఉంటుంది. అక్కడక్కడ చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. ఆదివారం గాలిలో తేమ 58 శాతంగా నమోదైంది.

## న్యూస్‌రీల్

### అందుబాటులో 1100 కాల్ సెంటర్

• కలెక్టర్ ఆనంద్

**నెల్లూరు రూరల్:** పీజీఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారానికి 1100 కాల్ సెంటర్ అందుబాటులో ఉందని కలెక్టర్ ఆనంద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టోల్ ఫ్రీ నంబరు ప్రభుత్వ ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో ఒక భాగమని, ఇది పౌరులు లేవనెత్తిన సమస్యలను సంబంధిత విభాగాలకు పంపి సకాలంలో పరిష్కరించేలా చేస్తుందన్నారు. ప్రభుత్వ సేవలు, స్థానిక సమస్యలు ఇతర ప్రజాసమస్యలకు సంబంధించిన సమస్యలను నివేదించడానికి పౌరులు ఏ ఫోన్ నుంచి అయినా 1100కు ఉచితంగా కాల్ చేయొచ్చు అన్నారు. ఫిర్యాదులను తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో సౌలభ్యం కోసం నమోదు చేసుకోవచ్చునని, దీన్ని వినియోగించుకోవాలన్నారు.

### పాఠశాల విద్యార్థులకు నేటి నుంచి పరీక్షలు

• డీఈఓ బాలాజీరావు

**నెల్లూరు(అర్బన్):** జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలకు సంబంధించి 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు మొదటి నిర్మాణాత్మక మదింపు (ఎస్ఏఎంపీ-1) పరీక్షలు సోమవారం నుంచి జరుగుతాయని డీఈఓ బాలాజీ రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 1 నుంచి 5 తరగతుల విద్యార్థులకు మూడు రోజుల పాటు, 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు నాలుగు రోజుల పాటు టైం టేబుల్ ప్రకారం పరీక్షలు జరుగుతాయన్నారు. 11వ తేదీ ప్రథమ భాష తెలుగు, గణితం 12న ద్వితీయ భాష హిందీ, సామాన్యశాస్త్రం/భౌతికశాస్త్రం, 13న తృతీయ భాష ఆంగ్లం, సాంఘిక శాస్త్రం, 14న ప్రధాన భాష సంస్కృతం, జీవశాస్త్రం పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ప్రతి సబ్జెక్టుకు 35 మార్కులతో పాటు ప్రతి సబ్జెక్ట్‌లో తరగతి గది ప్రతిస్పందనలు, రాత పనులు, ప్రాజెక్ట్ పనులుకు ఒక్కొక్కటికి 5 మార్కులు చొప్పున ఉపాధ్యాయులు పరీక్షలు నిర్వహించి మొత్తం 50 మార్కులకు మదింపు చేస్తారని తెలిపారు. విద్యార్థులు పరీక్షలు రాసిన తర్వాత ఉపాధ్యాయులు జవాబులను మూల్యాంకనం చేసి ఆ మార్కులను మదింపు పుస్తకంలోని ఓఎంఆర్‌లో నమోదు చేసి, స్కాన్ చేసి లీప్ యాప్‌ద్వారా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని వివరించారు. పరీక్ష ఫలితాలను రాష్ట్ర స్థాయిలో మదింపు చేసి ప్రస్తుత విద్యాప్రమాణాల మీద, తదుపరి చర్యలపైన ఉపాధ్యాయులకు సూచనలు చేస్తారన్నారు.

### శిలాఫలకం ధ్వంసం కేసులో ఇద్దరి అరెస్ట్

• కావలి డీఎస్పీ శ్రీధర్



**కావలి (జలదంకి):** తమ్మలపెంట పట్టపుపాళెంలో జల్‌జీవన్ మిషన్ శిలాఫలకం ధ్వంసం కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు కావలి డీఎస్పీ కే శ్రీధర్ తెలిపారు. ఆదివారం కావలి డీఎస్పీ తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ తమ్మలపెంట పట్టపుపాళెంలో 2021లో ప్రభుత్వ పథకం జల్‌జీవన్ మిషన్, రోడ్డు నిర్మాణానికి సంబంధించి ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఇటీవల ధ్వంసం చేశారు. ఈ కేసులో ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పామంజి యానాదయ్య, కోడూరు జకరయ్య ఈ నెల 6వ తేదీ అర్ధరాత్రి జేసీబీతో శిలాఫలకాన్ని ధ్వంసం చేసి ట్రాక్టర్ల ద్వారా శిథిలాలను బయటకు తరలించారని తమ దర్యాప్తులో వెల్లడైందన్నారు. ఈ మేరకు వారిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు తెలిపారు. మిగిలిన ఐదుగురిని అరెస్ట్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ రాజేశ్వరరావు, ఎస్సై తిరుమలరెడ్డి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

# కింకర్తవ్యం

## అడ్డుగోలు కేసులో అడ్డంగా బుక్కైన ఖాకీలు

### ఇరకాటంలో పడిన వైనం

వైఎస్సార్‌సీపీ నేతలపై అడ్డుగోలుగా నమోదు చేసిన కేసులో పోలీసులు అడ్డంగా బుక్కయ్యారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెల్లూరు పర్యటనను అడ్డుకునేందుకు పోలీసులు పెట్టిన నిర్బంధ ఆంక్షలను లెక్క చేయకుండా భారీగా తరలివచ్చిన అభిమానులను కట్టడి చేయడానికి విచక్షణా రహితంగా లాఠీచార్జి చేశారు. ఈ క్రమంలో స్పెషల్ బ్రాంచ్ హెడ్‌కానిస్టేబుల్ ఆయనకై ఆయనే తట్టుకుని కింద పడ్డారు. ఆ సమయంలో ఆయన చుట్టూ పోలీసులు తప్ప.. పార్టీ కార్యకర్తలు ఎవరూ లేరు. ఈ ప్రదేశానికి కొంచెం దూరంలో మాజీమంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ పార్టీ ముఖ్య నేతలతో రోడ్డుపై బైఠాయించి ఉన్న చిత్రాలు బయటకు రావడంతో పోలీసులు ఖంగుతున్నారు. తమపై పెట్టిన అక్రమ కేసుపై వైఎస్సార్‌సీపీ నేతలు ఈ ఆధారాలను కోర్టు దృష్టికి తీసుకెళ్లనుండడంతో ఇరకాటంలో పడనున్నారు.






ముందు ప్రసన్నకుమార్‌రెడ్డి ఉంటే.. వెనుక పక్కన కిందపడిన హెడ్‌కానిస్టేబుల్ (వృత్తాల్లో చూడొచ్చు)

• వైఎస్ జగన్ పర్యటన సక్సెస్‌తో జీర్ణించుకోలేని కూటమి నేతలు
• తోపులాటలో హెడ్‌కానిస్టేబుల్ గాయపడ్డాడని 20 మందిపై అక్రమ కేసులు
• ఇప్పటికే కోవూరు మండల కన్వీనర్ అనూప్‌రెడ్డి అరెస్ట్
• మరికొందరి కోసం హైదరాబాద్ తోపాటు వివిధ ప్రాంతాల్లో ప్రత్యేక బృందాల గాలింపు
• వెలుగులోకి వచ్చిన ఆయనకై ఆయనే తట్టుకుని పడిన చిత్రాలు

**సాక్షిప్రతినిధి, నెల్లూరు:** కూటమి నేతల ఆదేశాలతో వైఎస్సార్‌సీ నేతలపై అక్రమ కేసులు బనాయించిన దర్గామిట్ట పోలీసులు ఇరకాటంలో పడ్డారు. పోలీసులుగా తమ విధులు వదిలేసి పచ్చ పార్టీకి విధేయులుగా వ్యవహరించి అడ్డంగా దొరికిపోయారు. లాఠీచార్జి ఘటనలో పోలీసుల దుందుడుకుగా వ్యవహరించడంతో స్పెషల్ బ్రాంచ్ హెడ్‌కానిస్టేబుల్ పక్కకు తప్పుకునే క్రమంలో ఆయనకై ఆయనే తట్టుకుని కింద పడిపోయాడు. ఈ ఘటనలో వైఎస్సార్‌సీపీ శ్రేణుల పాత్ర ఏమాత్రం లేదు. పోలీసులు నమోదు చేసిన ఘటనకు సంబంధించిన ఫొటోలు బయటకు రావడంతో ఇప్పుడేమి చేయాలో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు. ఈ ఫొటోలను న్యాయమూర్తి ముందు పెడితే పోలీసులపైనే చర్యలు తీసుకునే అవకాశం ఉందని న్యాయకోవిదులు చెబుతున్నారు.

**అడ్డుగోలుగా కేసులు**

ఘటనకు దారితీసిన పరిస్థితులు వాస్తవానికి భిన్నంగా ఉన్నప్పటికీ ఇవేమి తమకు పట్టవంటూ కూటమి నేతలు సూచించిన పేర్లను కేసుల్లో ఇరికించి పోలీసులు జైలుకు పంపుతున్నారు. ఇటీవల కావలి ఎస్బీ హెడ్‌కానిస్టేబుల్ చేయి విరిగిన ఘటనే ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. హెడ్‌కానిస్టేబుల్ ఫొటోలు తీస్తూ తనకు తాను తట్టుకుని కింద పడితే వైఎస్సార్‌సీపీ నేతలు నెట్టివేయడంతో కింద పడ్డానని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు వాస్తవాలు పరిశీలించకుండానే ఎస్బీహెడ్‌కానిస్టేబుల్ విధులకు ఆటంకం కలిగించడంతోపాటు ఆయన్ను నెట్టివేయడంతో కిందపడి చేయి విరిగిందంటూ నాన్‌బెయిల్‌బుల్ సెక్షన్లతో తొలుత నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డితోపాటు కౌన్సిలర్ బొబ్బల శ్రీనివాసయాదవ్, పాతపాటి ప్రభాకర్‌రెడ్డిపై కేసు నమోదు చేశారు. రెండు రోజుల తర్వాత కూటమి నేతలు ఇచ్చిన జాబితా ప్రకారం వైఎస్సార్‌సీపీ కోవూరు మండల అధ్యక్షుడు అత్తిపల్లి అనురూప్‌రెడ్డితోపాటు 17 మంది వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమంగా కేసులు బనాయించారు. 30 పోలీసు యాక్ట్ అమల్లో ఉండగా నిబంధనలు అతిక్రమించి ఆందోళన చేశారని ప్రసన్నకుమార్‌రెడ్డి తోపాటు మరికొందరుపై మరో కేసు నమోదు చేశారు. బైక్ ర్యాలీ చేశారని యువకులపై ఇంకో కేసు నమోదు చేశారు.

### చిత్రం సాక్షిగా దొరికిన ఖాకీలు

అక్రమ కేసుల్లో జిల్లా కేంద్ర కారాగార రిమాండ్‌లో ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో ములాఖత్, టీడీపీ కిరాయి ముష్కరుల దాడి ఘటన నేపథ్యంలో కోవూరు మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించేందుకు గత నెల 31వ తేదీన మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెల్లూరుకు వచ్చారు. అయితే జగన్ పర్యటనను అడ్డుకునేందుకు పోలీసులు పెద్ద ఎత్తున నిర్బంధ ఆంక్షలు విధించారు. అయితే ఆంక్షలను లెక్క చేయని వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు భారీగా తరలిరావడంతో కూటమి నేతలు జీర్ణించుకోలేకపోయారు. పోలీసులను ఉసిగొల్పడంతో ప్రభుత్వ పెద్దల మెప్పు కోసం ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ సమీపంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులపై అకారణంగా ఒక్కసారిగా లాఠీచార్జి చేశారు. దీంతో నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డితోపాటు పలువురికి గాయాలయ్యాయి. తనతోపాటు పార్టీ శ్రేణులపై లాఠీచార్జి చేయడాన్ని గర్హిస్తూ ప్రసన్నకుమార్‌రెడ్డి పోలీసుల చర్యలపై నిరసన వ్యక్తం చేస్తూ అక్కడే రోడ్డుపై బైఠాయించారు. లాఠీచార్జి జరుగుతున్న సమయంలో అక్కడున్న ఎస్బీ హెడ్‌కానిస్టేబుల్ మాలకొండయ్య ఫొటోలు తీసేందుకు వెనక్కి వెనక్కి వెళుతూ తనను తానే తట్టుకుని పడిపోతున్నట్లు ఫొటోలు, వీడియోలు బయటకు వచ్చాయి. సదరు హెడ్‌కానిస్టేబుల్ కింద పడిపోవడానికి లాఠీచార్జి చేస్తున్న పోలీసుల దూకుడుతోనే జరిగినట్లు స్పష్టమవుతోంది. ఈ ఘటనకు కొంచెం దూరంలో పార్టీ శ్రేణులతో ప్రసన్నకుమార్‌రెడ్డి రోడ్డుపై బైఠాయించిన దృశ్యం అదే చిత్రంలో కనిపిస్తోంది. హెడ్‌కానిస్టేబుల్ కింద పడుతున్నప్పుడు, పడిన తర్వాత ఆయనకు దగ్గరల్లో కేసులో పేర్కొన్న ఏ వ్యక్తి లేరని ఫొటోలు, వీడియోలతో తేలిపోయింది. దీనిని బట్టి చూస్తే కూటమి నేతలు ఓ పథకం ప్రకారం వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసులు నమోదు చేయించేందుకు హెడ్‌కానిస్టేబుల్‌ను ఉపయోగించుకున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఘటనలో వైఎస్సార్‌సీపీ నేతలకు ఎలాంటి సంబంధం లేదని పోలీసులకు తెలిసినప్పటికీ కూటమి నేతల ఒత్తిళ్లకు తలొగ్గి అక్రమ కేసులు నమోదు చేశారని తెలుస్తోంది. పోలీసులు తమపై పెట్టిన అక్రమ కేసులపై వైఎస్సార్‌సీపీ నేతలు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ క్రమంలోనే ఘటనకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు బయటకు రావడం వాస్తవాలకు సాక్ష్యంగా నిలుస్తోంది. తాజా పరిణామాలతో పోలీసులు ఇరకాటంలో పడ్డారు. ఎలాగైనా తామే కరెక్ట్ అని నిరూపించుకునే పనిలో పడ్డారు.



పోలీసుల మధ్యలోనే కింద పడిన హెచ్‌సీ

### అక్రమ కేసుల్లో అరెస్ట్‌లకు అత్యుత్సాహం



పోలీసుల తోపులాటలో పడిన హెచ్‌సీ, మరో వ్యక్తి

ఇద్దరు కూటమి ఎమ్మెల్యేల ఆదేశాలతో ఈ కేసులో మాజీ మంత్రి ప్రసన్నకుమార్‌రెడ్డితోపాటు 20 మందిని నిందితులుగా చేర్చారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వారి కోసం తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌తోపాటు చెన్నై, బెంగళూరు, వివిధ ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ కోవూరు మండల అధ్యక్షుడు ఎ.అనూప్‌రెడ్డిని అరెస్ట్ చేసిన తీరును చూస్తే దర్గామిట్ట పోలీసుల అత్యుత్సాహం కనిపిస్తోంది. ఆయనేమి ఉగ్రవాది కాదు, ఒక రాజకీయ పార్టీకి అధ్యక్షుడు. అటువంటి వ్యక్తి ఇంటిని అర్ధరాత్రి పూట భారీగా పోలీసులు చుట్టుముట్టి భయానక వాతావరణం సృష్టించడం చూస్తే పోలీసులు ఎవరి మెప్పు కోసం పనిచేస్తున్నారో అర్థమవుతోంది. ఆయన్ను అరెస్ట్ చేసి జైలుకు పంపారు. మరికొందరి కోసం వారి కుటుంబ సభ్యులపై తీవ్ర ఒత్తిడి తీసుకు వస్తున్నారు. వాస్తవానికి తమకు ఆ ఘటనతో ఎలాంటి సంబంధం లేదని వైఎస్సార్‌సీపీ నాయకులు చెబుతున్నప్పటికి పోలీసులు అవేమిపట్టించుకోకుండా కూటమి పెద్దలను మెప్పించే ప్రయత్నంలో ఉన్నారు.

# చేపల వేటకెళ్లి ఇద్దరు యువకుల మృతి

• మరొకరిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చిన మెరైన్ పోలీసులు
• తుమ్మలపెంట సముద్రతీరంలో ఘటన
• పల్లెపాలెంలో విషాదఛాయలు



విష్ణు, కృష్ణ మృతదేహాలు

**కావలి (జలదంకి):** చేపల వేటకు వెళ్లి మత్స్యకార యువకులు ప్రమాదవశాత్తు సముద్రంలో పడి గల్లంతై ఇద్దరు మృతి చెందిన ఘటన కావలి మండలం తుమ్మలపెంట సముద్రతీరంలో ఆదివారం జరిగింది. ఈ ఘటనలో మరొక యువకుడిని మెరైన్ పోలీసులు కాపాడి సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. పోలీసులు, స్థానికుల సమాచారం మేరకు.. తుమ్మలపెంట పల్లెపాళెంకు చెందిన శ్రీహరి-వెంకటేశ్వరమ్మ కుమారుడు వెయ్యాల విష్ణు (20), శ్రీను-సావిత్రమ్మ కుమారుడు అయ్యాల శివకృష్ణ (19), మరో యువకుడు గొల్లపోతు నాగాచార్యులు కలిసి మొయ్యవల తీసుకుని సముద్రంలో చేపల వేటకు వెళ్లారు. విష్ణు, శివకృష్ణ సుడిగుండంలో చిక్కుకుని గల్లంతయ్యారు. కొంత దూరంలో ఉన్న నాగాచార్య నీటిలో కొట్టుకుంటూ కేకలు వేశాడు. దీంతో మెరైన్ పోలీసులు స్పందించి స్థానిక మత్స్యకారులతో కలిసి బోటులో వెళ్లి నాగాచార్యను ఒడ్డుకు చేర్చారు. అప్పటికే నీట మునిగి అపస్మారక స్థితిలో ఉన్న విష్ణు, శివకృష్ణలను బోటులో ఒడ్డుకు తీసుకువచ్చారు. అయితే అప్పటికే వారు మృతి చెందారు. అనంతరం ఇద్దరి యువకుల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. దీనిపై రూరల్ ఎస్సై తిరుమలరెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# తుక్కు ఫోన్లు.. చెత్త యాప్‌లు

బాలలు, బాలింతలు, గర్భిణుల ఆరోగ్యానికి, పోషకాహారానికి భరోసాగా నిలుస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలకు కూటమి ప్రభుత్వం కుంపటిగా మారింది. పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ, పిల్లలకు క్రమశిక్షణ, ఆట పాటలతో కూడిన విద్యను అందించడంతోపాటు కిశోర బాలికల వ్యక్తిత్వ వికాసంలో కీలక పాత్ర పోషిస్తున్న అంగన్‌వాడీ సిబ్బందిపై పనిభారం పెరగడంపై అష్టకష్టాలు పడుతున్నారు. పని భారం తగ్గిస్తామని చెప్పిన కూటమి కొత్త యాప్‌లు తీసుకొచ్చి ఒత్తిడి మరింత పెంచింది. తుక్కు ఫోన్లు, చెత్త యాప్‌లతో విసిగిపోయిన వర్కర్లు ప్రభుత్వం తమికిచ్చిన సెల్‌ఫోన్లను ఆయా ప్రాజెక్ట్ కేంద్రాల్లో జమ చేసి తమ నిరసన వ్యక్తం చేశారు.

• ముఖ ఆధారిత గుర్తింపుతో రేషన్ పంపిణీ
• సపోర్టు చేయకపోవడంతో నమోదు కాని పరిస్థితి
• పని భారం.. అధికారుల ఒత్తిళ్లు
• విసిగిపోయిన అంగన్‌వాడీలు
• ఐసీడీఎస్ కార్యాలయల్లో ఫోన్ల అప్పగింత
• మానసిక వేదనతో సతమవుతున్న కార్యకర్తలు



వింజమూరు ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కార్యకర్తలు (ఫైల్)

**ఉదయగిరి:** జిల్లా వ్యాప్తంగా 12 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 2,934 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిల్లో 1,24,680 మంది పిల్లలు, బాలింతలు 13,098, గర్భిణులు 11,663 మంది ఉన్నారు. వీరికి అన్నీ సేవలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్నాయి. ఈ క్రమంలో ఇప్పటికే ఉన్న పనిభారంతో సతమవుతున్న కార్యకర్తలకు అదనపు యాప్‌లు పేరుతో మరింత భారం పెంచారు. దీంతో కార్యకర్తలు మరింత మానసిక ఆవేదన చెందుతున్నారు.

**కొత్త యాప్‌లకు సపోర్టు చేయని సెల్‌ఫోన్లు**

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారం పంపిణీలో పారదర్శకత కోసం గత ప్రభుత్వం అందజేసిన 2జీ ఫోన్ల ద్వారా నమోదు చేయించింది. అప్పటి విధులకు ఆ ఫోన్లు పని చేశాయి. కానీ కూటమి ప్రభుత్వం కొత్త ఫోన్లు ఇవ్వకుండా 5జీ సపోర్టు యాప్‌లతో అప్‌లోడ్ చేయాలని చెబుతున్నారు. అసలే అరకొర సిగ్నల్స్, పనిచేయని యాప్‌లతో కార్యకర్తలు తలలు పట్టుకుంటున్నారు. దీంతో విసుగు చెందిన కార్యకర్తలు కొత్త ఫోన్లు అయినా ఇవ్వండి లేదా కొత్త యాప్‌లు రద్దు అయినా చేసి పాత యాప్‌లు కొనసాగించండంటూ పలువురు కార్యకర్తలు తమ నిరసన గళం వినిపిస్తున్నారు. జిల్లాలో ఒక్క ఉదయగిరి తప్ప అన్ని ప్రాజెక్ట్‌ల్లోని పనిచేసే కార్యకర్తలు తమకిచ్చిన సెల్ ఫోన్లను ప్రాజెక్ట్ కేంద్రాల్లో ఇచ్చారు.

**రేషన్ పంపిణీలో ఇబ్బందులు**

కూటమి ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చి విధానంలో లబ్ధిదారులకు సరుకులు ఇవ్వాలంటే యాప్‌లో ముఖ ఆధారిత గుర్తింపు తప్పని సరి. ప్రస్తుతం అంగన్‌వాడీ కార్యకర్తల వద్ద ఉన్న పాత ఫోన్లు సపోర్టు చేయకపోవడంతో ఫేస్ క్యాప్చర్ కావడం లేదు. దీంతో చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు రేషన్ ఇవ్వడంలో ఇబ్బంది తలెత్తుతోంది. గతంలో కుటుంబంలో ఎవరూ వచ్చిన ఆహారం ఇచ్చే అవకాశం ఉండేది. కానీ కొత్త యాప్‌లో ఆ అవకాశం లేదు. దీంతో కార్యకర్తలు లబ్ధిదారులకు, అధికారులకు సమాధానం చెప్పలేక మానసిక ఆందోళనకు గురువుతున్నారు. పైగా యాప్‌లతోనే కుస్తీ పట్టాల్సిన రావడంతో పిల్లలపై దృష్టి పెట్టేందుకు సమయం సరిపోవడం లేదని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### అధికారుల వేధింపులు ఆపాలి



పని చేయని ఫోన్లు ఇచ్చి కార్యకర్తలపై అధికారులు ఒత్తిడి తెచ్చి వేధింపులకు గురి చేయడం మానుకోవాలి. కొత్త యాప్‌లు ప్రవేశపెట్టి అంతే స్పీడ్‌తో పాత ఫోన్లు ఎలా పని చేస్తాయనేది అధికారులకు తెలియదా?. అంగన్‌వాడీ కార్యకర్తలు చేసే పనులకు, వారికి ఇచ్చే వేతనం చూస్తే ప్రభుత్వం వారితో వెట్టి చాకిరి చేయిస్తోంది. ప్రభుత్వం పని తగ్గ వేతనం అమలు చేసి వారితో పనులు చేయించాలి.

– కాకు వెంకటయ్య

### ఫేస్ క్యాప్చర్ తీసివేయాలి



ముఖ ఆధారిత గుర్తింపు విధానం (ఫేస్ క్యాప్చర్) తీసి వేయాలి. ఈ విధానంలో లబ్ధిదారులు కచ్చితంగా కేంద్రం వద్దకే రావాలి. వారి ఫోన్లకు వచ్చే ఓటీపీ చెప్పాలంటే భయపడుతున్నారు. ప్రస్తుతం ఉన్న ఫోన్లు కొత్త యాప్‌లకు సపోర్టు చేయడం లేదు. సిగ్నల్స్ లేకపోవడంతో ఒక్కరికే గంటల తరబడి సమయం కేటాయించాలి వస్తుంది. మాన్యువల్ విధానమే కొనసాగించాలి.

– శ్రీదేవి, అంగన్‌వాడీ యూనియన్ లీడర్

# కొంటే.. కూర'గాయాలు'

• ఒక పక్క మండిపోతున్న ధరలు
• మరో వైపు తుకాల్లో మోసాలు
• వ్యాపారులు సిండికేట్‌గా దోపిడీ
• వినియోగదారుల జేబులకు చిల్లు

**నెల్లూరు (పొగతోట):** జిల్లాకు కూరగాయలు సరఫరా చేసే ప్రధాన ఏసీ కూరగాయల మార్కెట్ అవినీతిమయమైంది. ఈ మార్కెట్లో అధికారులు అనేక పర్యాయాలు తనిఖీలు చేసినా, కేసులు పెట్టినా వ్యాపారుల్లో మార్పు రావడం లేదు. అధికారులు తనిఖీ సమయంలో మాత్రం జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. అధికారులు వెళ్లిన తర్వాత వ్యాపారుల తీరు షరా మామూలుగానే మారుతోంది. తూకాల్లో మోసాలు, కుళ్లిపోయిన, పుచ్చిపోయిన కూరగాయలను వినియోగదారులకు అంటగడుతున్నారు. వ్యాపారులు నిత్యం వినియోగదారుల జేబులకు చిల్లులు పెడుతున్నారు. ఈ తంతు నిత్యం జరుగుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

**కేజీకి 850 గ్రాములే..**

కేజీ కూరగాయలు తీసుకుని బయటకు వచ్చి తూకం వేస్తే 850 గ్రాములు మాత్రమే ఉంటున్నాయి. వినియోగదారులు తూకం వేసి పరిశీలించుకునేందుకు ధర్మకాటా ఏర్పాటు చేశారు. ధర్మకాటా బోర్డు మాత్రం కనిపిస్తోంది. కానీ కాటా కనిపించదు. నిత్యం వేలాది మంది వినియోగదారులు ఇక్కడ కూరగాయలు కొనుగోలు చేస్తూ మోసపోతున్నారు. ఈ విషయంపై అధికారులకు ఫిర్యాదులందినా నామమాత్రపు చర్యలతో సరిపెట్టుకుంటున్నారనే విమర్శలున్నాయి. గతంలో జిల్లాలో పనిచేసిన జాయింట్ కలెక్టర్ ఈ మార్కెట్‌పై నిఘా పెట్టి, తరచూ తనిఖీ చేయడంతో ఆయన ఉన్నంత కాలం వ్యాపారులు నిజాయితీగా వ్యవహరించారు. ఆయన వెళ్లిపోయాక కొత్తగా వచ్చిన ఏ అధికారి కూడా పట్టించుకోకపోవడంతో తిరిగి యథారాజా తథ ప్రజాగా మారారు.




కాటా లేని ధర్మకాటా బోర్డు

### కుళ్లినవి, పుచ్చినవి అంటగడుతున్నారు

నెల్లూరుకు వచ్చిన సమయంలో ఇంటికి వెళ్లేటప్పుడు మార్కెట్‌లో కూరగాయలు కొనుగోలు చేస్తాం. వ్యాపారులు వినియోగదారుల జేబులకు చిల్లులు పెడుతున్నారు. కుళ్లినవి, పుచ్చినవి అంటగడుతున్నారు. ఇవేమని ప్రశ్నిస్తే భలే కొన్నావ్‌లే పోవయ్యా అంటూ ఛీదరించుకుంటున్నారు. అధికారులు చొరవ తీసుకొని వినియోగదారులు నష్టపోకుండా చూడాలి.

– విజయేంద్రబాబు, పొదలకూరు

### వ్యాపారులకు నోటీసులిస్తాం

వినియోగదారులు నష్టపోకుండా ప్రత్యేక దృష్టి సారిస్తాం. వినియోగదారులను నష్టపరుస్తున్న వ్యాపారులపై దృష్టి పెట్టి నోటీసులు అందించి కేసులు నమోదు చేస్తాం. నిత్యం ధర్మకాటా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటాం.

– అనితకుమారి, మార్కెటింగ్ ఏడీ

## క్లుప్తంగా

### బెల్టుషాపుపై దాడులు

• 48 మద్యం బాటిళ్ల స్వాధీనం

దుత్తలూరు: దుత్తలూరు పంచాయతీ పరిధిలోని కమ్మవారిపాళెం మలుపు వద్ద అనధికారికంగా నిర్వహిస్తున్న బెల్టుషాపుపై ఆదివారం దుత్తలూరు పోలీసులు దాడులు నిర్వహించారు. ఉన్నతాధికారుల సమాచారం మేరకు ఉదయగిరి సీఐ వెంకట్రావు, దుత్తలూరు ఎస్సై ఆదిలక్ష్మి తన సిబ్బందితో దాడులు నిర్వహించి అక్రమంగా నిల్వ ఉంచిన 48 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకుడు నాగరాజును అదుపులోకి తీసుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన బైక్

• యువకుడికి గాయాలు

దగదర్తి: మండలంలోని ఉలవపాళ్ల హైవే సర్వీస్ రోడ్డుపై ఆర్టీసీ బస్సును వెనుక నుంచి మోటార్ బైక్ ఢీకొనడంతో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. ఆదివారం కావలి నుంచి నెల్లూరు వైపు పల్లెవెలుగు బస్సు వెళ్తోంది. ఉలవపాళ్ల సర్వీసు రోడ్డు స్టాప్‌లో ప్రయాణికులు దిగారు. లోపల ఉండిపోయిన ఓ ప్రయాణికురాలు బస్సు ఆపాలని అడగడంతో డ్రైవర్ నిలిపాడు. అదే గ్రామానికి చెందిన ప్రవీణ్ బైక్‌పై వెళుతూ ఆగి ఉన్న బస్సును వెనుక నుంచి ఢీకొన్నాడు. అతడి కుడి కాలుకు తీవ్ర గాయమైంది. వెంటనే బంధువులు కావలి హాస్పిటల్‌కు తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జంపాని కుమార్ తెలిపారు.

### పోలీసుల అదుపులో జూదరులు

విడవలూరు: పేకాట స్థావరాలపై పోలీసులు దాడులు చేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న ఘటన మండలంలోని ముదివర్తి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ఆదివారం మధ్యాహ్నం ముదివర్తి గ్రామం పాత ఇసుక ర్యాంపు సమీపంలో వేపచెట్టు కింద కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నారని సమాచారం అందడంతో ఎస్సై పి.నరేష్ తన సిబ్బందితో వెళ్లి దాడులు చేశారు. అదే గ్రామానికి చెందిన ఎస్కే బాబు, షేక్ హనీఫ్, మారుబోయిన విష్ణుకుమార్, తంగం శ్రీనివాసులును అదుపులోకి తీసుకున్నారు. రూ.4 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. నలుగురిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఎస్సై తెలియజేశారు.

• మనుబోలు: మండలంలోని మనుబోలు దళితవాడలో పేకాట స్థావరంపై ఆదివారం ఎస్సై శివరాకేష్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు చేశారు. స్థానికులిచ్చిన సమాచారంతో దాడులు చేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.4,200 నగదు స్వాధీనం చేసుకున్నారు.

### ఆర్ఐఎంసీకి విద్యార్థి ఎంపిక


దేగా చంద్రిల్‌రెడ్డి

సంగం: మండలంలోని సిద్ధీపురం గ్రామానికి చెందిన దేగా చంద్రిల్‌రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకమైన డెహ్రాడూన్‌లోని రాష్ట్రీయ ఇండియన్ మిలటరీ కళాశాల (ఆర్ఐఎంసీ)లో సీటు సాధించాడు. 8వ తరగతి ప్రవేశం కోసం గత సంవత్సరం డిసెంబర్‌లో ప్రవేశపరీక్ష జరిగింది. చంద్రిల్‌రెడ్డి ప్రతిభ చూపాడు. ఇంటర్మీడియట్ వరకు చదువుకునే అవకాశం ఉంది. అతను 6, 7 తరగతుల బుచ్చిరెడ్డిపాళెంలోని ఓ ప్రభుత్వ పాఠశాలు చదవడం విశేషం. తండ్రి దేగా మనోహర్‌రెడ్డి, తల్లి పవిత్ర తమ బిడ్డ సాధించిన విజయానికి సంతోషం వ్యక్తం చేశారు. ఎయిర్‌ఫోర్స్ అధికారి కావడమే తన లక్ష్యమని చంద్రిల్‌రెడ్డి చెబుతున్నాడు.

### 15 నుంచి రాపూరమ్మ జాతర

రాపూరు: మండల కేంద్రంలోని గ్రామదేవత రాపూరమ్మ జాతర ఈనెల 15వ తేదీ నుంచి జరుగుతుందని నిర్వాహకులు ఆదివారం తెలిపారు. ప్రాచీన కాలంనాటి ఈ ఆలయంలో 15న ఉదయం అభిషేకం, అంకురార్పణ, అమ్మవారి ఆహ్వానం, 16న పూలంగిసేవ, అన్నదానం, గంగపెట్టె ఊరేగింపు, 17న గ్రామ పొంగళ్లు, రాత్రి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

### కండలేరులో 25.917 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 25.917 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 5,280 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,700, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 40, మొదటి బ్రాంచ్ కాలువకు 80 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

### నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ : రూ.112
లేయర్ : రూ.115
బ్రాయిలర్ చికెన్: రూ.208
స్కిన్‌లెస్ చికెన్: రూ.230
లేయర్ చికెన్: రూ.195

### నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.50
సన్నవి : రూ.30
పండ్లు : రూ.20

# నిమ్మ ధరలు పైపైకి..


**బస్తా కాయలు రూ.4 వేలు**
• ధరలు మరింత పెరిగే అవకాశం
• బయట మార్కెట్లలో పెరుగుతున్న డిమాండ్
• దిగుబడి తగ్గి రైతుల దిగాలు

నిమ్మ ధరలు పెరిగాయని సంతోష పడాలా?, దిగుబడి లేనందుకు బాధపడాలో అర్థం కాని స్థితిలో రైతులున్నారు. శ్రావణ మాసం నేపథ్యంలో ఇటీవల స్వల్పంగా ధరలు పెరిగాయి. తాజాగా అమాంతం ఒక కిలో రూ.30 నుంచి రూ.50కి చేరింది. బస్తా కాయలు ప్రస్తుతం మార్కెట్లో రూ.4 వేలకు అమ్ముతున్నారు. నెలాఖరుకు ధరలు మరింతగా పెరగొచ్చని తెలుస్తోంది.

పొదలకూరు: ఈ ఏడాది నిమ్మ మార్కెట్ సంక్షోభంలో కొట్టుమిట్టాడింది. ధరలు పతనమై కిలో కాయలు రూ.15కు కూడా అమ్ముడుపోలేదు. చాలా మంది రైతులు తోటల్లోనే కాయలను వదిలిలేయాల్సి వచ్చింది. అయితే పండగల సీజన్ రావడంతో కొంత ఊపిరి పీల్చుకున్నా ధరలు తాత్కాలికంగా ఉంటాయని వ్యాపారులు అభిప్రాయపడుతున్నారు. అక్టోబర్ నుంచి వర్షాలు మొదలైతే కాయల ఎగుమతి పూర్తిగా తగ్గిపోతుంది. కాగా దసరా వరకు రైతులకు నష్టం వాటిల్లకుండా ధరలు ఉంటాయని చెప్పుకొస్తున్నారు.

**సంక్షోభం నుంచి కోలుకుంటూ..**

ఈ ఏడాది సీజన్‌లో సైతం ధరలున్నా కాయల్లేక, ఒక వేళ కాయలుంటే ధరల్లేక రైతులు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కోవాల్సి వచ్చింది. ఆరేళ్ల నాడు ఇలాంటి పరిస్థితే వచ్చింది. వ్యాపారులు కొనుగోలు చేసిన కాయలను పారబోసేవారు. గతేడాది ఇదే సీజన్లో బస్తా రూ.9 వేల వరకు అమ్ముడుపోయింది. కాయలు ఉన్నన్ని రోజులు ధరలు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. తీరా తోటల్లో కాయలు లేకపోవడంతో ఇప్పుడు డిమాండ్ మెల్లగా పెరిగింది. ఢిల్లీ మార్కెట్ పుంజుకోవడంతో ధరలు పెరుగుతున్నట్టు తెలుస్తోంది. అయితే దీనివల్ల ప్రత్యేకంగా ఒనగూరే ప్రయోజనం ఉండదని రైతులు చెబుతున్న మాట. చాలామంది తోటల్లో కాయలు పలచబారి లేకుండాపోతున్నాయి. కాయలున్న ఆర్థికంగా నిలదొక్కుకుంటారు. ఈ ప్రాంతంలో 4 వేల ఎకరాల్లో తోటలన్నాయి. నిమ్మను మెట్టరైతులను వేరుచేసి చూడలేని పరిస్థితి ఉంది. ఎన్ని కష్టాలు, నష్టాలొచ్చినా ఈ సాగును వీడటం లేదు.


మార్కెట్‌కు వచ్చిన నిమ్మకాయలు

**ధరలు పెరగడం మంచిదే..**



ధరలు పెరగడం మంచి పరిణామమే. అయితే నెల రోజులు ముందుగా పెరిగుంటే చాలా మంది రైతులు బాగుపడేవారు. తోటల్లో కాయలు లేని తర్వాత పెరగడం వల్ల తక్కువ మందికి ప్రయోజనం కలుగుతుంది. ప్రస్తుతం కాయలున్న రైతులకు ఆర్థికంగా కొంత మేలు జరుగుతుంది.

– పి.పెంచలనారాయణరెడ్డి, నిమ్మ రైతు, మొగళ్లూరు

**ఆటుపోట్లు మామూలే..**



ఈ ప్రాంత నిమ్మ రైతులకు ధరల్లో ఆటుపోట్లు మామూలైపోయింది. ఎన్ని కష్టాలు వచ్చినా నిమ్మను వీడలేం. ఒక ఏడాది ఆదాయం వస్తే మరో ఏడాది నష్టం వస్తుంటుంది. అంతమాత్రాన సాగును వదిలిపెట్టేది ఉండదు. నిమ్మలోనే జీవించడం వల్ల మాకు నష్టం వచ్చినా పట్టించుకోం.

– కేపీ నారాయణరెడ్డి, నిమ్మ రైతు, అంకుపల్లి

**ఢిల్లీ మార్కెట్‌కు పంపుతున్నాం**



మార్కెట్లో ధరలు ఆశాజనకంగా ఉండటంతో వ్యాపారంలో వేగం పెరిగింది. అయితే తోటల్లో కాయలు తగ్గుముఖం పడుతున్నందునే ధరలు పెరుగుతున్నాయి. ఢిల్లీ మార్కెట్‌కు ఎగుమతి చేయడం జరుగుతుంది. ఇటీవల వరకు ఆ మార్కెట్ వ్యాపారులు కాయలను వద్దనేవారు. ఇప్పుడు కావాలంటున్నా కాయలు తగినన్ని లేకపోవడంతో ఉన్నవాటినే పంపుతున్నాం.

– ఎం.బాలకృష్ణారెడ్డి, వ్యాపారి, నిమ్మ మార్కెట్, పొదలకూరు

### 13న ప్రత్యేక విద్యుత్ అదాలత్

• ఈఈ సోమశేఖర్‌రెడ్డి వెల్లడి


మాట్లాడుతున్న ఈఈ సోమశేఖర్‌రెడ్డి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఈనెల 13వ తేదీ బుధవారం పొదలకూరులో ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ నెల్లూరు రూరల్ డివిజన్ ఈఈ సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. నగరంలోని విద్యుత్ భవన్‌లో ఉన్న కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. రూరల్ డివిజన్ పరిధిలోని రాపూరు, నెల్లూరు రూరల్, పొదలకూరు, ముత్తుకూరు సబ్ డివిజన్ పరిధిలోని రాపూరు, సైదాపురం, పొదలకూరు, మనుబోలు, కలువాయి, నెల్లూరు రూరల్, ముత్తుకూరు, తోటపల్లిగూడూరు మండలాలతోపాటు విరుపూరు, కోడూరు, వెంకటాచలం, కావేరినగర్, బుజబుజనెల్లూరు, నారాయణరెడ్డిపేట సెక్షన్ల విద్యుత్ వినియోగదారుల సమస్యలపై ఈ అదాలత్ జరుగుతుందన్నారు. పొదలకూరు విద్యుత్ సబ్ స్టేషన్‌లో నిర్వహించే ఈ కార్యక్రమానికి సీజీఆర్ఎఫ్ చైర్మన్ వి.శ్రీనివాస ఆంజనేయమూర్తి, ఆర్థిక సభ్యులు మధుకుమార్, సభ్యురాలు విజయలక్ష్మి, ఎస్పీడీసీఎల్ జిల్లా ఎస్ఈ విజయన్, డిస్కం అధికారులు విచ్చేస్తారన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగదారలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువు

• వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత



మాట్లాడుతున్న మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): 'కూటమి ప్రభుత్వంలో మహిళల పరిస్థితి చూస్తుంటే బాధ వేస్తోంది. వారికి రక్షణ కరువైంది. రాష్ట్రంలో మత్తు పదార్థాలు విపరీతంగా దొరుకుతున్నాయి. శాంతిభద్రతలకు విఘాతం కలుగుతోంది' అని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత అన్నారు. నెల్లూరులోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆమె ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత జగనన్న ప్రభుత్వం మహిళలకు అండగా నిలిచిందన్నారు. వారి కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిందన్నారు. వారికి పదవులు ఇచ్చినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వంలో పరిస్థితులు మరోలా ఉన్నట్లు చెప్పారు. అంగన్‌వాడీ కార్యకర్తలు కష్టపడి పనిచేస్తుంటే వారి సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. 5జీ ఫోన్లు ఇవ్వలేక సొంత ఖర్చులతో పనిచేయమని చెప్పడం దారుణమన్నారు. మహిళల సమస్యలపై ఈ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు.

**జగనన్నకు కృతజ్ఞతలు**

నియోజకవర్గ స్థాయిలో పనిచేసే తనను మహిళా విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించినందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పూజిత కృతజ్ఞతలు తెలిపారు. పదవికి వన్నె తెచ్చేలా బాధ్యతాయుతంగా పనిచేస్తానన్నారు. తన తండ్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి జైలుకు వెళ్లి 75 రోజులైందన్నారు. ఆయన బయటకు వస్తారని ప్రతిరోజూ అనుకుంటున్నామన్నారు. కేసులపై కేసులు వేసి తమను మానసికంగా వేధిస్తున్నప్పుడు జగనన్న ఫోన్‌లో మాట్లాడి ఓదార్చడమే కాకుండా నెల్లూరుకు వచ్చి నాన్నను కలిసి ధైర్యం చెప్పారని, ఆయన రుణం ఎలా తీర్చుకోవాలో తెలియడం లేదన్నారు. సర్వేపల్లి నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, జిల్లా, రాష్ట్ర స్థాయి నేతలు కాకాణికి అండగా ఉన్నారని, వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కాకుటూరు లక్ష్మీసునంద, అంగన్‌వాడీ విభాగం రాష్ట్ర కార్యదర్శి వెంకటజ్యోతి, జెడ్పీటీసీ సభ్యురాలు ఎంబేటి శేషమ్మ, ఆత్మకూరు మహిళా అధ్యక్షురాలు, జెడ్పీటీసీ ప్రసన్న, సర్వేపల్లి నియోజకవర్గ అధ్యక్షురాలు సంధ్యారాణి, నెల్లూరు రూరల్ అధ్యక్షురాలు రమాదేవి, నెల్లూరు సిటీ అధ్యక్షురాలు ధనుజారెడ్డి, ఇంకా శారద, బషీరా, ముంతాజ్, హైమ, వసంత తదితరులు పాల్గొన్నారు.

# సోదరుడికి రాఖీ కట్టేందుకు వచ్చి..

• పాముకాటుకు గురై మహిళ మృతి


మహిళ మృతదేహం

సంగం: ఓ మహిళ తమ్ముడికి రాఖీ కట్టి తన ఇంట్లోకి వెళ్లింది. అక్కడున్న నాగుపాము కాటుకు గురై చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన మండలంలోని అన్నారెడ్డిపాళెం పల్లిపాళెం గ్రామంలో జరిగింది. సంగం మండలం అన్నారెడ్డిపాళెం పల్లిపాళేనికి చెందిన పాకం రావమ్మ (50) కొన్ని సంవత్సరాలుగా బుచ్చిరెడ్డిపాళెంలో పనులు చేసుకుంటోంది. రాఖీ పౌర్ణమి సందర్భంగా శనివారం ఉదయం అన్నారెడ్డిపాళెం పల్లిపాళెంలో ఉంటున్న తన తమ్ముడు కనిసిరి హజరత్తయ్య వద్దకు వెళ్లి రాఖీ కట్టింది. పక్కనే ఉన్న తన ఇంటిని చూసేందుకు రావమ్మ వెళ్లింది. అప్పటికే అక్కడున్న నాగుపాము ఆమెను కాటు వేసింది. కేకలు వేయడంతో హజరత్తయ్య, గ్రామస్తులు బుచ్చిరెడ్డిపాళెంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రావమ్మ రాత్రి మృతిచెందింది. ఆదివారం ఉదయం పల్లిపాళెంలో అంత్యక్రియలు చేశారు. ఈ కార్యక్రమం పూర్తయిన తర్వాత ఆమె ఇంట్లోకి వెళ్లిన బంధువులకు కాటువేసిన నాగుపాము కనిపించడంతో కొట్టి చంపేశారు.

# కరాటే పోటీల్లో బంగారు పతకం



ట్రోఫీ అందుకుంటున్న సరిత

కలిగిరి: మండలంలోని బసిరెడ్డిపాళెం గ్రామానికి చెందిన బోరెడ్డి సరిత తంజావూరులో నిర్వహించిన మూడో ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ – 2025లో ప్రతిభ చూపి ప్రథమ స్థానంలో నిలిచింది. పెరియార్ మణియమ్మై ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ కళాశాల ఆవరణలో 'కింగ్ షిటో – ర్యూ స్పోర్ట్స్ కరాటే డో ఇండియా' ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో ఇంటర్నేషనల్ పోటీలు జరిగాయి. మొదటి స్థానంలో నిలిచిన సరితకు నేషనల్ కరాటే ఫెడరేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్, సినీ నటుడు సుమన్, జాతీయ కార్యదర్శి డాక్టర్ పియూ ష్‌జైన్ బంగారు పతకం, ట్రోఫీ అందజేశారు. తనకు శిక్షణ ఇచ్చిన లక్ష్మీసామ్రాజ్యం, రవికి సరిత ప్రత్యేక ధన్యవాదాలు తెలిపింది.

# కన్నపేగు విలవిల

• కుమార్తె మృతితో గుండెలవిసేలా రోదించిన తల్లిదండ్రులు


రోదిస్తున్న హేమశ్రీ తల్లి

నెల్లూరు(క్రైమ్): చదువుల్లో రాణిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహిస్తుందనుకున్న కుమార్తె అర్థాంతరంగా తనువు చాలించడంతో కన్నపేగు విలవిల్లాడింది. కుమార్తె మృతిని తట్టుకోలేక తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తూ కుప్పకూలిపోయారు. వారి రోదన చూపరులను కంటతడి పెట్టించింది. వివరాలిలా ఉన్నాయి. తిరుపతి జిల్లా సత్యవేడు మండలం రాచపాళెం గ్రామానికి చెందిన పి.తిరుమలయ్య, వేదవతి దంపతులకు హేమశ్రీ (16), మరో కుమార్తె, కుమారుడు సంతానం. తిరుమలయ్య శ్రీసిటీలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఉన్నతంలోనే పిల్లలను చదివిస్తున్నాడు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా హేమశ్రీ చిన్నతనం నుంచే చదువుల్లో చురుకుగా ఉండేది. పదో తరగతిలో 550 మార్కులు సాధించింది మండల టాపర్‌గా నిలిచింది. కుమార్తె మంచి మార్కులు సాధించడంతో భవిష్యత్‌లో మరింతగా చదువుల్లో రాణించి ఉన్నత స్థితిలో ఉంటుందని తల్లిదండ్రులు కలలుగన్నారు. ఆమెను నెల్లూరు అన్నమయ్య సర్కిల్ సమీపంలోని ఆర్ఎస్ఆర్ కళాశాలలో ఎంపీసీ మొదటి సంవత్సరంలో చేర్పించారు. కళాశాల హాస్టల్లో ఉంటూ చదువుకుంటోంది. కొంతకాలంగా ఒత్తిడిని తట్టుకోలేకపోతున్నానని ఆమె తల్లిదండ్రులకు చెప్పి బాధపడుతూ ఉండేది. తల్లిదండ్రులు ఆదివారం కళాశాల ప్రిన్సిపల్‌తో మాట్లాడతామని చెప్పారు. ఈక్రమంలోనే హేమశ్రీ మృతిచెందింది. నెల్లూరుకు చేరుకున్న తల్లిదండ్రులు కుమార్తె మృతిని తట్టుకోలేక రోదిస్తూ కుప్పకూలిపోవడం చూపరులను సైతం కంట తడిపెట్టించింది. వారిని ఓదార్చడం ఎవరితరం కాలేదు. కుమార్తెను కళాశాల వారే పొట్టన పెట్టుకున్నారని వారు ఆరోపించారు. తమ కుమార్తె ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదని, ఆమె మృతి వెనుక అనుమానాలున్నట్లు తెలిపారు. ఈ ఘటనపై పోలీసు అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి అందుకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## కేసు నమోదు చేయాలంటూ..


ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు


విద్యార్థిని తల్లిని ఓదార్చి తీసుకెళ్తున్న ఆశ్రిత్‌రెడ్డి తదితరులు

• ఆర్ఎస్ఆర్ కళాశాల ఎదుట విద్యార్థి సంఘాల ధర్నా
• నేతలను తరిమికొట్టిన పోలీసులు

నెల్లూరు(అర్బన్): విద్యార్థిని ఆత్మహత్య ఘటనపై పోలీసులు ఆర్ఎస్ఆర్ జూనియర్ కళాశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు ఆశ్రిత్‌రెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేంద్ర డిమాండ్ చేశారు. ఆదివారం ఆ కళాశాల వద్ద ఆయా సంఘాల నేతలు, కార్యకర్తలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆశ్రిత్‌రెడ్డి, నరేంద్ర మాట్లాడుతూ విద్యార్థిని ఆత్మహత్య ఉదయం జరిగినప్పుడు సాయంత్రం వరకు తల్లిదండ్రులకు కళాశాల యాజమాన్యం చెప్పకపోవడం దారుణమన్నారు. ఈ వ్యవహారంలో సమగ్ర విచారణ జరిపి కేసు నమోదు చేయాల్సి ఉందన్నారు. విద్యాశాఖాధికారులు కళాశాలకు వచ్చి పరిశీలించకపోవడం శోచనీయమన్నారు. ఆత్మహత్య చేసుకున్న కుటుంబానికి న్యాయం చేసేవిధంగా కలెక్టర్ స్పందించి కళాశాల గుర్తింపును రద్దు చేసి సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు.

**న్యాయం అడిగితే..**


పోలీసులు లాగేయడంతో చినిగిన చొక్కా

విద్యార్థి నేతలు కళాశాల వద్ద ధర్నా నిర్వహించడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని హెచ్చరించారు. అయినా కదలకపోవడంతో తరిమికొట్టారు. ఈ ఘటనలో ఎస్ఎఫ్ఐ నాయకులను ఈడ్చి వేయడంతో చొక్కాలు చినిగిపోయాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతుంటే పోలీసులు కళాశాల యాజమాన్యానికి అనుకూలంగా తమపై దౌర్జన్యం చేయడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి సంఘం నాయకులు తౌఫిక్, అబిద్, ఉస్మాన్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరసింహ, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు నాగేంద్ర, చైతన్య, జగదీష్, సుకుమార్, యశ్వంత్, సురేంద్ర, గణేష్ తదితరులు పాల్గొన్నారు.